

26న జాబ్‌మేళా

ప్రజాశక్తి- అరకులోయ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో అరకు ఐటిఐ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 26న బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి ఒక ప్రకటన లో తెలిపారు. జాబ్‌మేళాలో మదర్,ఫాదర్ హెల్త్‌కేర్ సర్వీసెస్, రిలయబుల్ నియో స్పేస్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయబుల్ ఫైర్ సేఫ్టీ సర్వీసెస్‌లో 164 ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారన్నారు. పదవ తరగతి, ఐటిఐ, ఎఎన్ఎం ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి వున్న 18- 40 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులు స్థానిక అరకులోయ ఐటిఐ కళాశాలలో తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9491057527 లేదా 9949927899 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పిఎం జన్‌మన్ ఇళ్లకు ఆర్థిక సాయం పెంచాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర
- ప్రజాచైతన్య యాత్రల సమస్యలపై పిజిఆర్ఎస్‌లో వినతి
- గిరి గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు డిమాండ్



అనంతగిరిలో సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీలో గిరిజనులతో వెళ్తున్న జెడ్‌పిటిసి గంగరాజు



అరకులోయలో ఆందోళనలో మాట్లాడుతున్న సిపిఎం నేత సురేంద్ర

ప్రజాశక్తి అరకులోయ రూరల్:గిరిజన గ్రామాల్లో మంచినీరు,రోడ్లు, డ్రైనేజ్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర అన్నారు. సోమవారం సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అరకులోయ మండల కేంద్రంలో ప్రజా చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం భవనం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ పిఎం జనమన్ పథకం ద్వారా పివిటిజి మంజూరు చేస్తున్న గృహాలకు ప్రభుత్వం ఇచ్చే రాయితీ సరిపోవడం లేదని, రూ. 10 లక్షలకు పెంచి అందజేస్తే, ఇళ్లు పూర్తవుతాయన్నారు..ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకం ఏమైందని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దళారుల చేతుల్లో మోసపోకుండా మిరియాలు,కాఫీ పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, జిసిసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిరియాలు రైతులకు గిట్టుబాటుతోపాటు, ఉచితంగా నిచ్చెన లు, పల్వింగ్ మిషన్ లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ మాడగడ, బస్కి, సుంకరమెట్ల పంచాయతీల్లో అటవీశాఖ అభ్యంతరంతో ఆగిన రోడ్ల పనులు పూర్తిచేయాల న్నారు. పెదలబుడు పంచాయతీలో సువ్వగూడ, లింబగూడా గ్రామాల్లో గిరిజన రైతులకు సాగుపట్టాలు ఇవ్వాలని, సుంకరమెట్ట, చిన్నలబుడు, పెదలబుడు, చొంపి పంచాయితీలో చెక్ డ్యాంలు, చెరువుల్లో పూడికలు తీయించి సాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు వివి జయ,మండల కార్యదర్శ సభ్యులు పి బాలదేవ్,గత్తుం బుజ్జిబాబు, మగ్గన్న, జగన్నాథం , రామన్న ,సుంకరమెట్ట సర్పంచ్ చిన్నబాబు, పద్మాపురం ఉపసర్పంచ్ జన్ని భగత్ రాం, జోషి, నాని బాబు, బస్ బాబు పాల్గొన్నారు.

అనంతగిరి : అటవీశాఖ అభ్యంతరాలతో రోడ్ల పనులు నిలిచిపోవడంతో గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదని,ఇప్పటికైనా వీటికి మోక్షం కల్పించాలని సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు అన్నారు. సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా గ్రామాల్లో సమీకరించిన సమస్యలపై మండల కేంద్రంలో భారీర్యాలీ, మండల పరిషత్ వద్ద ఆందోళన చేపట్టి, ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎంపిడిఒ ఎవివి కుమార్, తహశీల్దార్ మాణిక్యం, ఫారెస్ట్ రేంజర్ ఆర్.రాజాబాబులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ పినకోట పంచాయతీ సింధుగులపాడు . తట్టపూడి పెద్ద బూరిగ తదితర గ్రామాలకు రూ.16 కోట్ల 67 లక్షలు, గుమ్మ పంచాయతీ పరిధి కరిగేడ. కడరేవు గ్రామాలకు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనా అటవీశాఖ మోకాలడ్డుతో పనులు జరగలేదన్నారు. కొండిబ పంచాయతీ డముకలస డుంబ్రివలస పివిటిజి గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పిఎం జన్‌మన్ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు ఇంటినిర్మాణ సాయం రూ.10లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిలో. మోస్య అనంతగిరి సిపిఎం సర్పంచ్ సోమ్మెల రూతు, వెంగడ మాజీ సర్పంచ్ సివేరి. కొండలరావు. మండల నాయకులు జి దేవన్న, వి. బుద్రయ్య, ఎన్. చిన్న గంగులు. భీమన్న, దేవుడమ్మ., ఎస్. రాజు పాల్గొన్నారు

డుంబ్రిగుడ: మండ ప్రజా చైతన్య యాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో మూడు రోడ్ల జంక్షన్ నుంచి మండల పరిషత్ వరకు ర్యాలీ నిర్వహించి, ఎంపిడిఒ ప్రేమ సాగర్‌కు వినతిపత్రం అందజేశారు పలు గ్రామాలకు రోడ్డు తాగునీరు కొండపోడు పట్టాలు, వంతెనల నిర్మాణం ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. డుంబ్రిగుడ మండల మండల నాయకులు పి సురేష్ కుమార్ , టి సూర్యనారాయణ,పి దొంబు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

ముంచింగిపుట్టు: పిఎం జన్‌మన్‌లో పేర్కొన్న 12 సంక్షేమ పథకాలను పివిటిజిలకు అందించాలని మండలంలోని వనుగుమ్మ గ్రామ సచివాలయం ఎదుట సోమవారం సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండల కమిటీ సభ్యుడు, కె శంకరరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికసాయం రూ.పది లక్షలకు పెంచాలని, నాన్ పివిటిజిలకు పిఎంఎవై 2.0 హౌస్ జియోట్యాగింగ్ గడువు పెంచాలని అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇతర పథకాలను అందించాలని కోరారు. పి.సింగూరు, ఎస్ గురు, కె.సుఖదేవ్ పాల్గొన్నారు.

పెదబయలు : పిఎం జన్‌మన్ ఇళ్ల ఆర్థికసాయం రూ.పది లక్షలకు పెంచాలని సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ జి, రంగారావుకు వినతిపత్రం అందజేశారు, సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో సేకరించిన సమస్యల పరిష్కారానికి స్టేట్‌బ్యాంకు నుంచి మండల పరిషత్ వరకు ర్యాలీగా వెళ్లి ఎంపడిఇఒకు వినతిపత్రం అందజేశారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొర్ర నరసయ్య కొర్ర,వెంకట్రావు, మట్టం రామారావు, వంతల రాజు, వం తల సుందరన్న వంతల సిద్దేశ్వర రావు పాల్గొన్నారు

హుకుంపేట: : సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గ్రామాల్లో గుర్తించిన సమస్యలను పార్టీ మండల కమిటీ కార్యదర్శి వి.లక్ష్మణరావు, టి,అప్పాలకొండ పడాల్, ఎస్.హైమావతి ఆధ్వర్యంలో గిరిజన సంఘం కార్యాలయం నుంచి మండల పరిషత్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి, పిజిఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. తాగునీరు, పోడుపట్టాలు, పాఠశాలలు, అంగన్వాడీ భవనాల మరమ్మతులు, పివిటిజిలకు అంత్యోదయ కార్డులు మంజూరు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. జాతీయ రహదారి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారావు, డి.కృష్ణమూర్తి, విశ్వనాథం, తౌడన్న, పి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో ర్యాలీ, మండల పరిషత్ ముట్టడి ఆందోళన నిర్వహించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతులు రద్దు, ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లింపు, పిఎం జన్‌మన్ ఇళ్ల ఆర్థికసాయం రూ.పది లక్షలకు పెంపు, జిఒ 3 ప్రయోజనాల పునరుద్ధరణ, గిరి గ్రామాలకు తారురోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పన, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు సాగిన చిరంజీవి, స్థానిక మహిళలు, గిరిజనులు, సిపిఎం నేతలు పాల్గొన్నారు.

ఆర్‌వి.నగర్-పాలగెడ్డ రహదారి నిర్మించాలి

సీలేరు : జికె.వీధి మండలం ఆర్‌వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి నిర్మాణం తక్షణమే ప్రభుత్వం చేపట్టాలని సిపిఎం గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో గుర్తించిన సమస్యలపై సోమవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ముందుగా చైతన్య స్రవంతి నుండి హౌసింగ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ ఆర్‌వి నగర్ నుంచి పాలగడ్డ వరకు రహదారి గతేడాది వరదలకు కొట్టుకుపోయి దయనీయంగా ఉందని, తక్షణమే పునర్నిర్మించాలని కోరారు. ఆదివాసీలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న గృహాలకు సంబంధించి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాగూరు కోటేశ్వరరావు, మురళి చంటిబాబు, కొర్ర బాలయ్య, గేములు పరమేశ్వరరావు, ఆదిమజాతి నాయకులుకొర్ర జగన్, జనసేన మండల ఉపాధ్యక్షులు మార్కు బొమ్మరిల్లు, మాజీ సర్పంచ్ బాబురావు, కిలో బాబురావు, కోర్ర రాంబాబు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



హుకుంపేటలో సమస్యలపై ర్యాలీగా వెళుతున్న సిపిఎం బృందం



పెదబయలులో సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన



ముంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు



చింతపల్లిలో మండల పరిషత్ ముట్టడిలో సిపిఎం నేతలు



జికె.వీధిలో సిపిఎం ఆధ్వర్యాన ప్లకార్డులతో నిరసన



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 65 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో వివిధ సమస్యలపై 65 అర్జీలను ప్రజలు సమర్పించారు. వీటిని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో డిఎన్వి.రమణ స్వీకరించారు. ఈ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఐటిడిఎ పిఒ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం.రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడియంహెచ్ఓ జి.శిరీష, డిఎల్డిఓ కె.కోటేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం డాక్టర్ వెంకటఇందిర, డిఎల్‌పిఓ నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, గాబ్రియల్, వెంకటసుబ్బయ్య, ఉపాధి హామీ ఈపిడి జి.శ్రీనివాసరావు, ఎంపిడిఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం ప్రభుత్వ ఆసుపత్రిని అడిషనల్ డిఎంహెచ్ఓ ప్రతాప్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. 2008-09 సంవత్సరంలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టారు. వైద్యాధికారి సంపత్ బాబుతో మాట్లాడారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మందుల కొరత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సంపత్ బాబు, సిహెచ్ఐ ప్రశాంత్ పాల్గొన్నారు.




రికార్డులు తనిఖీ చేస్తున్న ఎడిఎంహెచ్ఓ ప్రతాప్

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీషదేవి లబ్ధిదారులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.19.30 లక్షలు విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందించినట్లు చెప్పారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అనారోగ్యానికి గురైన నిరుపేదలకు వైద్య సేవ నిమిత్తం ప్రభుత్వం నుండి సహాయాన్ని అందిస్తారని విషయం తమకు తెలియదని లబ్ధిదారులు అంటున్నారని, అంటే వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఒక్కరికి కూడా సహాయం అందలేదని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించినట్లు చెప్పారు. గిరిజన చట్టాలకు ఎటువంటి విఘాతం కలగకుండా 1950 ముందు నుండి నియోజకవర్గంలో నివసిస్తున్న నిరుపేద గిరిజనేతరులకు పక్కా గృహాలు నిర్మించాలని కోరినట్లు తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం దీనిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో తన గెలుపునకు గిరిజనులు, గిరిజనేతరులు సమానంగా కృషి చేశారని, కనుక తన దృష్టిలో గిరిజనులు, గిరిజనేతరులు సమానమేనని, అందుకనే అసెంబ్లీలో గిరిజనేతరుల గురించి ప్రస్తావించానని తెలిపారు. అనంతరం దేవీపట్నం మండలంలోని పోచమ్మగండి ఆలయ జాతర ఉత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, 11 మండలాల టిడిపి అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

కాకనూరులో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు

జికె.వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ కాకనూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డీకే హిమబిందు ఆధ్వర్యాన సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో మహిళలు, చిన్నారులు, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పుల వల్ల గిరిజన గ్రామాల్లో జ్వరం, దగ్గు, జలుబు రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధి సోకిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. వేసవి ప్రారంభం కావడంతో పగటిపూట ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని, ప్రజలు వడదెబ్బకు గురికాకుండగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీళ్లు అధికంగా తాగాలని, నిల్వ ఆహారం తినరాదని సూచించారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, శిశువులకు నాటు వైద్యం, పసర మందులు వంటివి వేయరాదని హితవుపలికారు. అనంతరం ప్రపంచ క్షయ దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు క్షయపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లోవ కుమారి, ఏఎన్ఎంలు సీత, మత్స్యకొండ, పారామెడికల్ సిబ్బంది చందు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న డాక్టర్ హిమబిందు



రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

ఉరుములు, ఈదురుగాలులతో వర్షం

- చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగిలో సోమవారం సాయంత్రం ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం వరకు తీవ్రమైన ఎండ కాయడంతో ఎండవేడిమికి ఉక్కపోతకు మన్యం వాసులు అల్లాడిపోయారు. అయితే సాయంత్రం ఆకాశంలో ఒక్కసారిగా నల్లమబ్బులు కమ్ముకొని వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షం జీడిమామిడి, మామిడి తోటలకు, వ్యవసాయ పంటలకు మేలుచేకూరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

అఖిల భారత ఎస్‌టి ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని ఆల్ ఇండియా షెడ్యూల్ ట్రైబ్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సత్యనారాయణ అన్నారు. ఆదివారం అరకులోయ గిరిజన ఉద్యోగుల భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బోయ /వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ఎపిఎమ్మెల్యేలు, మంత్రులు అసెంబ్లీలో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని, బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చితే గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వెలిబుచ్చారు. టిడిపి, వైసిపి, జనసేన బిజెపి పార్టీలు బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని మద్దతు తెలపడం సరికాదని అన్నారు. జిఒ3 రద్దుతో గిరిజన నిరుద్యోగులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. జిఒ 3 పునరుద్ధరణ చేసి, గిరిజన స్పెషల్ డిఎస్‌సి ప్రకటించి ఉపాధ్యాయ ఉద్యోగాలతోపాటు ఖాళీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటీకరణ చేయడంతో కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్, ఉద్యోగాల్లో గిరిజనులు ఒక్కరు కూడా లేరని తెలిపారు. ఐదవ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టం, పీసా చట్టం నిబంధనలను తుంగల తొక్కి అనంతగిరి, చింతపల్లి ప్రాంతంలో హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి చేసుకున్న ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.. టూరిజం పేరుతో బడా కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు మన్యంలోని భూములు అప్పజెప్పేందుకు ప్రభుత్వం కుట్రచేస్తోందన్నారు..వేలాది మంది త్యాగం చేసి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం చేయబోమని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. విశాఖ ఉక్కు ఉద్యోగులకు నాలుగు నెలలు నుండి జీతాలు ఇవ్వకుంబా ఇబ్బందులకు గురిచేయడం, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు ఇవ్వకుండా నిర్వీర్యం చేయాలన్న కుట్రలను మానుకుని, విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి నిధులు, గనులు ఇవ్వాలని కోరారు. అరకులోయ మండలం లోతేరు, పంచాయితీ, డుంబ్రిగుడ గ్రామంలో మూడ నమ్మకాలతో తోటి గిరిజనులను దారుణంగా కొట్టి పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని, ఇలాంగి ఘటనలను పునరావృతం కాకుండా మన్యవాసులను చైతన్యపరిచే చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పి దేముడు, గిరిజన ఉద్యోగ జిల్లా నాయకులు నందో, ఎల్ బి కామేశ్వరరావు పాల్గొన్నారు.



కేంద్రం వద్ద పడిగాపులు పడుతున్న గిరిజనులు

ఇకెవైసికి రేషన్ లబ్ధిదారుల అగచాట్లు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : నెలాఖరులోగా ఇకెవైసి చేయించుకోకుంటే, వచ్చేనెల నుంచి రేషన్ సరుకులు అందని అధికారుల ప్రకటనతో రేషన్‌కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇకెవైసి చేయించుకోవడానికి మారుమూల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు పిల్లాపాపలు, వృద్ధులతో మండల కేంద్రానికి తరలివచ్చారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఒకేఒక ఆధార్ కేంద్రంలో ఉండడంతో అక్కడికి చేరుకుని ఇకెవైసి కోసం గిరిజనాలు బారులు దీరారు. అయితే ఉన్న ఒకే ఆధార్ కేంద్రంలో ఇంతమందికి ఇకెవైసి సాగని పరిస్థితుల్లో అనేకమందికి పనిజరగకుండానే నిరాశగా వెనుదిరిగిపోయే పరిస్థితి ఉంది నెలాఖరు అంటే మరో వారం రోజులైనా గడువు లేని పరిస్థితిలో ఇకెవైసి ఎలా చేయించుకోవాలని రేషన్ లబ్ధిదారులు అందోళన చెందుతున్నారు. ఇకెవైసి కాకుంటే ప్రస్తుతానికి రేషన్ నిలిచిపోయినా, ఆ తర్వాత పెన్షన్లు, ఇతర పథకాలు అందకుండా పోతాయని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇకెవైసి నమోదు గడువును పెంచడంతోపాటు మండల కేంద్రంలో రేషన్ లబ్ధిదారులు ఇకెవైసి నమోదుకు వీలుగా మరిన్ని కేంద్రాలను నెలకొల్పాలని మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనులు కోరుతున్నారు.



అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చిన పవిత్ర

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

ప్రజాశక్తి -అనంతగిరి : పురిట్టినప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణి, ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో ఆసుపత్రిలోనే ప్రసవించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలివి. మండలంలోని బొర్రా పంచాయలీ పరిధి కొట్యాగుడ గ్రామానికి చెందిన జన్ని పవిత్ర మొదటి కాన్పులో పురిట్టి నొప్పులతో బాధపడుతూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో, కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా స్థానిక పిహెచ్‌సికి తరలిస్తుండగా, మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో 108అంబులెన్స్ సిబ్బంది సహకారంతో ప్రసవం చేయించార. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగానే ఉన్నప్పటికీ, 108 అంబులెన్స్ సిబ్బంది వైద్యపరీక్షల కోసం అనంతగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు నిర్ధారించారు

పిజిఆర్‌ఎస్‌లో 27 వినతులు

ప్రజాశక్తి -అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యలప రిష్కార వేదికలో ్ 27 వినతులు స్వీకరించామని ఎంపిడిఒ ఏవివి కుమార్ తెలిపారు . జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించే పిజిఆర్‌ఎస్‌లో మండలంలోని 24 పంచాయతీ పరిధి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు లిఖితపూర్వకంగా అందజేసిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.మాణిక్యం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

సజీవ దహనం కేసులో 8 మంది అరెస్టు

మరో వ్యక్తి పరారీ
డిఎస్‌సి షాహబాజ్ అహ్మద్

ప్రజాశక్తి- అరకులోయ/అరకులోయ రూరల్ : అరకులోయలో సంచలనం రేపిన డుంబ్రిగూడ గ్రామానికి చెందిన ఆడారి డొంబు సజీవ దహనం కేసును అరకులోయ పోలీసులు 48 గంటల్లో చేధించారు. ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో పాడేరు డిఎస్‌పి షేక్ షాహబాజ్ అహ్మద్ మాట్లాడుతూ, కేసు వివరాలను వెల్లడించారు. అరకులోయ మండలం,లోతేరు పంచాయతీ . డుంబ్రిగూడ గ్రామంలో 16 కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వీరంతా ఆరు నెలల క్రితం వరకు కలసిమెలసి భాగానే ఉన్నా, అప్పట్లో అడారి సోహిత అనే మహిల అనారోగ్య కారణాలతో పురుగుల మందు తాగి మృతి చెందిన తర్వాత వీరిలో కలహాలు మొదలయ్యాయి.

మృతుడు .అడారి డొంబుకు చేతబడి శక్తి ఉందని భావించిన అడారి అర్జున్, సింహాద్రి, హరికృష్ణ, గాసి, సీతన్న, గురునాథ్,చంద్రరావు, కమల, మాణిక్, తదితరులు , అతనితో గొ డవ జరిగినప్పటికీ గ్రామ పెద్దలు సయోధ్య కుదిర్చారు. ఆ తర్వాత కూడా గ్రామంలో ఎవరికీ ఆరోగ్యం బాగోలేకపోయినా ఎవరైనా చనిపోయినా అడారి డొంబునే కారణమని అనుమానిస్తూ వస్తున్నారు. రెండు వారాల క్రితం అడారి అర్జున్ భార్య నీలిమ ఆరోగ్యం బాగోలేక విజయనగరంలో చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. అదేరోజున అడారి గురునాథ్‌కు అలాగే కమల కొడుకైన రామునాయుడికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో వీటన్నింటికీ అడారి డొంబు చిల్లంగి పెట్టడమే కారణమని నిర్ణయానికి వచ్చిన వారంతా,డొంబు బతికుంటే గ్రామంలోని అందరినీ చంపేస్తాడని భావించి, ఈ నెల 21 న సాయంత్రం 6 గంటల సమయంలో నిందితులంతా డొంబుతో గొడవ పడి, కర్రలు, రాళ్లలతో,చేతులతో కొట్టి, అప్పటికి చనిపోకపోవడంతో నిందితుల్లో ఒకరైన అడారి సింహాద్రి కిటికీ గుండా రెండు లీటర్ల పెట్రోల్ పోసి నిప్పంటించబోగా, డోంబు భార్య,కూతురు అడ్డుకుని మంటలను ఆర్పేస్తే, చివరగా డొంబు తలపై రాయితో కొట్టి దారుణంగా మట్టుబెట్టారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు అనంతరం ఇద్దరు మహిళలతో సహా తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. అరకు సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు ఇలాంటి ఏడు చిల్లంగి అనుమానిత హత్య కేసులు జరగ్గా, నిందితులందరికీ జీవితఖైదు జైలుశిక్ష పడిందని డిఎస్‌పి వెల్లడించారు. ప్రజలు మూడనమ్మకాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.కార్యక్రమంలో అరకు సర్కిల్ సిఐ ఎల్ హిమగిరి, అరకులోయ ఎస్‌ఐ జిగోపాల్ రావు,అనంతగిరి ఎస్సై డి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌సి షాహబాజ్ అహ్మద్

గుండెపోటుతో అంగన్వాడీ సూపర్‌వైజర్ మృతి

ప్రజాశక్తి.చింతపల్లి: చింతపల్లి ఐసిడిసివ్ ప్రాజెక్ట్ పరిధిలోని గ్రేడ్-1 అంగన్వాడీ సూపర్వైజర్ చిక్కం సత్యవతి గుండెపోటుతో మృత్యువాత పడ్డారు. శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా స్థానిక పాఠశాల ఆవరణలో పాటపాడుతూ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. తోటి ఉద్యోగస్తులు హుటాహుటిన చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డారు. సత్యవతి హఠాన్మరణంతో సహచర ఉద్యోగస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సహచర ఉద్యోగులు, అంగన్వాడి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లి, సత్యవతి మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.



చిక్కం సత్యవతి (ఫైల్‌ఫొటో)

నేడు విత్తన సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- చింతపల్లి: మొక్కల పరిరక్షణ, విత్తనాల భద్రత, రైతుల హక్కులపై అవగాహన కల్పించేందుకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో బిసిటీ కషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నారని బిసిటి, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా తెలిపారు. అవగాహన కార్యక్రమంలో మొక్కల పరిరక్షణ, రైతుల హక్కులు, విత్తన సంరక్షణ చట్టం - 2001పై వివరిస్తామన్నారు. రైతులు స్వయంగా విత్తనాలను ఉత్పత్తి చేసుకోవడం, వాటిని భద్రపరచడం, మార్కెటింగ్ చేయడం, నకిలీ విత్తనాల గుర్తింపు వంటి హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు గిరిజన ప్రాంత మండలాల నుంచి రైతులు, స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఆహ్వానించినట్లు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.



సిడిపిఒ బాలామణిదేవి

నేటి నుంచి మినీ అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి -హుకుంపేట: ఆరేళ్లలోపు పిల్లలకు ప్రాథమికఆరోగ్య సంరక్షణ, పోషణ, బాల్య విద్యను అందించడంపై అంగన్వాడీ మినీ కార్యకర్తలకు ఈనెల 25 నుంచి మూడురోజులపాటు శిక్షణనివ్వనున్నట్లు స్థానిక సిడిపిఒ సిహెచ్ బాలామణిదేవి తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో నిర్వహించే శిక్షణకు ప్రాజెక్టు పరిధిలోని మినీ అంగన్వాడీ కార్యకర్తలంతా విధిగా హాజరుకావాలన్నారు.

ప్రజల సహకారంతో రుషికొండ బీచ్ అభివృద్ధి



బ్లూ ఫ్లాగ్ జెండాను ఎగురవేసిన మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి -మధురవాడ : ప్రజల సహకారంతో రుషికొండ బీచ్‌ను దేశంలోనే ఉన్నతంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్ బీచ్ జెండాను ఆయన పునరుద్ధరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని 13 బీచ్‌ల్లో రుషికొండ బ్లూ ఫ్లాగ్ హోదాను కలిగి ఉండటం అదృష్టమన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహణ బాగోలేకపోవడం వల్ల బ్లూ ఫ్లాగ్ బీచ్ గుర్తింపు రద్దయిందని తెలిపారు. తిరిగి రాష్ట్ర ప్రభుత్వం, సిబ్బంది సహకారంతో ఆ హోదా దక్కిందని అన్నారు. రుషికొండ బీచ్‌లో అన్ని సదుపాయాలు కల్పిస్తే దేశ, విదేశీ పర్యాటకులు వస్తారన్నారు. టూరిజం అధికారులు దీనిపై దృష్టి సారించాలన్నారు. స్థానిక దుకాణదారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వారికి ఇచ్చిన స్థలంలో వారు వ్యాపారం చేసుకోవాలని, ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అన్నారు. టిడిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంటా రవితేజ మాట్లాడుతూ స్థానిక సమస్యలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసెంబ్లీలో ప్రస్తావించారన్నారు. రానున్న రోజుల్లో రుషికొండ బీచ్ అభివృద్ధికి ఆయన కృషి చేస్తారని తెలిపారు. అనంతరం టూరిజం శాఖ అధికారులు మాట్లాడుతూ రుషికొండలో చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో టూరిజం శాఖ ఎమ్‌డి ఆమ్రపాలి, జెసి మయూర్ అశోక్, స్థానిక కార్పొరేటర్లు నొడగల అప్పారావు, పిళ్ళా మంగమ్మ పాల్గొన్నారు.

రవాణా కార్మికుల సమస్యలపై ధర్నాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్/అనకాపల్లి : రవాణా కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం ధర్నాలు నిర్వహించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన ధర్నాను ఉద్దేశించి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుంటే మే 20 నుంచి రవాణా కార్మికులు బంద్‌కు దిగక తప్పదని హెచ్చరించారు. రవాణా రంగంలో రిక్షా మొదలుకొని ఆటో, ట్యాక్సీ, లారీ, ప్రైవేట్ బస్సు, ఆర్టీసీ వగైరాలన్నీ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ఈ దుస్థితికి కారణమని తెలిపారు. రవాణా రంగంలో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు, సామాజిక సంక్షేమ చట్టం.. ఇలా ఏవీ అమలు కావడం లేదన్నారు. మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న రవాణా రంగ కార్మికులకు సామాజిక సంక్షేమ చట్టం ఇంతవరకు లేదన్నారు. పుండు మీద కారం చల్లిన చందంగా మోటారు వాహనాల చట్ట సవరణలో భారీగా పెంచిన పెనాల్టీల భారంతో నడ్డి విరుగుతోందని తెలిపారు. పోలీసుల వేధింపులు నిత్యకృత్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రాజ్‌కుమార్, కె.సత్యనారాయణ, విశాఖ క్యాబ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోలినాయుడు, బాబ్జి, ఆనందం, కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ దేశ అభివద్ధిలో కీలకంగా ఉన్న మోటార్ రంగ కార్మికుల సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు భద్రత లేకుండా ఉందని వాపోయారు. భారత న్యాయ సంహిత చట్టంలో ప్రమాదాలకు డ్రైవర్‌నే బాధ్యుడిని చేస్తూ కఠిన శిక్షలు నిర్దేశించడం దారుణమన్నారు. డీజిల్, వాహనాల కొనుగోలుపై సెస్ విధించి మోటార్ డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే డ్రైవర్లకు ఏ ప్రమాదం జరిగినా భరోసాగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వరరావు, అద్దె బస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్‌పి నాయుడు, పలక సత్యనారాయణ, శ్రీనువాసరావు, శంకర్రావు, సూరిశెట్టి బాబునాయుడు చింత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో క్షయవ్యాధి నిర్మూలన

పలుచోట్ల అవగాహనా ర్యాలీలు



రంపచోడవరంలో సాగుతున్న అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- పాడేరు టౌన్

క్షయవ్యాధి రహిత జిల్లాగా ప్రకటించడమే అందరి లక్ష్యమని ఐటిడిఎ ఇన్చార్జి పిఒ, జెసి డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సోమవారం అంబేద్కర్ జంక్షన్ నుండి ఐటిడిఎ కార్యాలయం వరకు క్షయవ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటిడిఎలో నిర్వహించిన సమావేశంలో క్షయ వాధి నివారణకు సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా దవపత్రాలను పంపిణీ చేసారు. ముందుగా టివి బ్యాక్టీరియాని కనిపెట్టిన రాబర్ట్ కాచ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ హెచ్ ఒడి శ్రీకాంత్ రెడ్డి, పల్మనాలజిస్ట్ డా. ప్రియాంక దర్శిని, ఎస్‌పిఎన్ డా.వివేక వర్ధిని, డిటిసి మెడికల్ ఆఫీసర్ డా. సత్యనారాయణమ్మ, కోఆర్డినేటర్ సంధ్య, డాట్స్ సూపర్‌వైజర్ రామరాజు, వైద్య సిబ్బంది, ఎఎన్‌ఎం ట్రైనింగ్ సెంటర్ ట్రైనీ ఎఎన్ ఎంలు, పాల్గొన్నారు.

చింతపల్లి : రెండు వారాల మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలున్న వారు దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్లి ఉమ్మి పరీక్ష చేయించుకోవాలని, క్షయవ్యాధి నిర్ధారణ అయితే వైద్యులు సూచనతో క్రమం తప్పకుండా మందులు వాడితే టిబి నయమౌతుందని అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి టి ఎన్ ప్రతాప్ అన్నారు. సోమవారం చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలనా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం సూపరింటెండెంట్ ఇంద్ర ప్రియాంక, డిప్యూటీ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌లతో కలిసి ప్రాంతీయ ఆస్పత్రిలోని టిబి ల్యాబ్, జనరల్ ల్యాబ్, శిశు సంరక్షణ కేంద్రం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్.వి నగర్ పిహెచ్‌సి వైద్యాధికారి రాజా రవీంద్రనాథ్ చౌదరి, ఎంపీహెచ్ఇఒ జాన్సన్, ఎంపిహెచ్‌ఎస్ ఎస్ శాంతమణి, ఎఎన్‌ఎంలు కే విజయలక్ష్మి, ఎస్ వరలక్ష్మి, ఎల్ లక్ష్మమ్మ, పెంట కుమారి, డి వెంకటరమణమ్మ, ఎంఎల్ హెచ్ పి లు ఈ లక్ష్మి, పావని, హెల్త్ అసిస్టెంట్స్ ప్రకాష్, లక్ష్మణ్, నెహ్రూ, సత్యరావు, ఆశా కార్యకర్తలు, ప్రాంతీయ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి నుంచి బజారు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిహెచ్ఇఒ కె .మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వైద్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పి సాంబశివరావు, కె. ప్రియాంక కె. మమ్ముట్టి, వి. భానుప్రసాద్, బి. భాసర్ యు. శ్రీనుబాబు, టి. వీర్రాజు, ఎంపిహెచ్‌ఎం ఎన్‌జివి. ప్రసాద్ పాల్గొన్నారు.

రంపచోడవరం : ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీలు సోమవారం నిర్వహించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద ర్యాలీని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ జెండా ఊపి ప్రారంభించారు. ఐటిడిఎ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ టీబీ నిర్మూలన కొరకు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బాగా పనిచేసిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలో టిబి లక్షణాలు ఉన్నవారు దగ్గర్లో ఉన్న ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ రోగులకు నెలకు రూ.1000 చొప్పున ఆరు నెలలకు ఒకసారి 6 వేల రూపాయలు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. టిబి రోగులకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, ఎడియంహెచ్ఓ జి.శిరీష, ఏరియా ఆసుపత్రి ఆర్‌ఎం పి.వెంకటఇందిరా, వైద్యాధికారులు అపూర్వ, సుబ్రహ్మణ్యం, రవి కిరణ్, కెవిన్ బాబు, డేవిడ్, హరికృష్ణ, ఎంపిహెచ్ఓ పీటర్, మలేరియా కోఆర్డినేటర్ చిట్టిబాబు,హెల్త్ సెల్ అధికారి ఝాన్సీ, హెల్త్ వర్కర్ వై.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, హెచ్‌విలు, ఎల్టిలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : క్షయవ్యాధి శాశ్వత నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పీహెచ్సీల వైద్యాధికారులు సుష్మ, నాగార్జున అన్నారు. క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లాగరాయి, రాజవొమ్మంగి, జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. రాజవొమ్మంగిలో వైద్యాధికారి సుస్మా ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పద్మావతి, సుధాకర్, రత్నబ్బాయి, విశ్వారెడ్డి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : ప్రజలు టీవీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, సౌమ్య పేర్కొన్నారు. ప్రపంచ టీవీ డే సందర్భంగా జీకే వీధి మండలం సీలేరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పిహెచ్సి నుండి ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎన్ త్రినాథ్, బి.బాలమణి, ఏఎన్‌ఎంలు శ్రీదేవి, కేవిఎన్ కుమారి, ఆశాలు కార్యకర్త వి.కరుణామణి తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో ఉత్తమ సేవా ధ్రువపత్రాలు అందజేస్తున్న అభిషేక్ గౌడ



సుగ్గిరెడ్డి మృతదేహం

తమ్ముడిని హత్య చేసిన అన్న

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం తాడేపల్లి పంచాయతీ నీలవరం గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. ఆర్థిక లావాదేవీల కారణంగా తమ్ముడిని సొంత అన్నయ్య విల్లంబుతో హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నీలవరం గ్రామంలో తుంబుడు సుగ్గిరెడ్డి ఇంటికి ఆదివారం ఉదయం సుమారు 11 గంటల సమయం ఆయన అన్నయ్య తుంబుడు లచ్చిరెడ్డి వెళ్లారు. తనకు డబ్బులు ఎప్పుడు ఇస్తావు అంటూ గొడవ పడ్డాడు. ఈ క్రమంలో లచ్చిరెడ్డి తన వెంట తీసుకువెళ్లిన విలంబుతో తమ్ముడు సుగ్గిరెడ్డిపై దాడి చేశాడు. దీంతో సుగ్గి రెడ్డి అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు. సమాచారం అందుకున్న మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ, ఎస్సై సాదిక్, గుర్తేడు ఎస్సై పార్థసారథి తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికులను విచారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ గోపాలకృష్ణ తెలిపారు. మృతుడు సుగ్గిరెడ్డికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఉరవకొండ ఆదివాసీలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : అనకాపల్లి జిల్లాలోని మాడుగుల మండలం ఉరవకొండ గ్రామ రెవెన్యూ రికార్డుల్లో ఆదివాసీలు సాగుచేస్తున్న భూములు ఇతరుల పేర్లలో నమోదు కావడంపై ఉన్నతాధికారులతో దర్యాప్తు చేయించి ఆదివాసీలకు న్యాయం చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ పూర్వ కమిషనర్ ఇఎఎస్.శర్మ లేఖ రాశారు. తరతరాలుగా ఆదివాసీల అనుభవంలోనున్న భూములను ఇతరుల పేర్లలో రికార్డుల్లో అక్రమంగా మార్పులు చేయడంతో ఆదివాసీలను జీడి మామిడి తోటల నుంచి తొలగిస్తామని రెవెన్యూ అధికారులు భయపెడుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఉపాధి పోతే ఉరి తప్ప ప్రత్యామ్నాయం లేదని ఆదివాసీ మహిళలు ఆందోళన చేసినట్లు మీడియాలో వచ్చిందని వివరించారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేయడంతో ఆదివాసీలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయి ఆదివాసీల పేర్లు తొలగించి, ప్రయివేటు వ్యక్తుల పేర్లను కంప్యూటరైజ్డ్ చేయడంపై 2024 నవంబరు 19న లేఖ ద్వారా రాష్ట్ర రెవెన్యూ మంత్రి దష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. ఆదివాసీ మహిళలు తమ భూముల కోసం ఉద్యమం చేయడం చాలా బాధాకరమన్నారు. అనకాపల్లి జిల్లాలో రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించడం లేదని అర్థమవుతోందని పేర్కొన్నారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అత్యంత సానుభూతి చూపించాల్సిన అవసరముందన్నారు. తక్షణమే జోక్యం చేసుకుని సీనియర్ రెవెన్యూ అధికారులతో దర్యాప్తు చేయించి ఆదివాసీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆశాల ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆశా వర్కర్లను జాబ్ చార్ట్ ప్రకారం పని చేసుకోనివ్వాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు బి.పద్మ, కార్యదర్శి వి.మేరీ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌ను రెగ్యులర్ చేయాలని, పని భారం తగ్గించాలని అన్నారు. జాబ్ చార్ట్ ప్రకారం తగిన పని కేటాయించాలన్నారు. ఎండల తీవ్రత రీత్యా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేయడానికి అవకాశం కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని కోరారు.